నాణ్యతకు తిలోదకాలు!



ఉప్పరిపేట సమీపంలో గ్రావెల్ రోడ్డుపై వేసిన ఇసుక

- ఇష్టానుసారంగా రహదారుల నిర్మాణ పనులు
- ఉప్పరిపేట రోడ్డు పనుల్లో విరివిగా ఇసుక వినియోగం
- బీటీ రోడ్డు పనుల్లో ఇసుక వేస్తే ఎలా అని ప్రశ్నిస్తున్న స్థానికులు
- నియోజకవర్గంలో 38 రహదారులకు రూ.19.33 కోట్లు మంజూరు

నరసన్నపేట నియోజకవర్గంలో చేపడుతున్న రహదారుల అభివృద్ధి పనుల వివరాలు ఇలా..

మండలం	తారు రోడ్లు	సీసీ రోడ్లు	నిధులు
నరసన్నపేట	3	20	రూ.5.67 కోట్లు
జలుమూరు	3	00	రూ.4.90 కోట్లు
పోలాకి	3	4	రూ.4.55 కోట్లు
సారవకోట	4	1	రూ.4.22 కోట్లు

నరసన్నపేట: రానున్న సంక్రాంతి నాటికి గోతులు లేని రహదారులుగా రాష్ట్రాన్ని మారుస్తామని కూటమి ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. కింది స్థాయి నాయకులు మాత్రం దీనికి విరుద్ధంగా వ్యవరిస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న రహదారుల అభివృద్ధి పనుల నాణ్యతపై విమర్శలు పెరుగుతున్నాయి. ఇది మా ప్రభుత్వం.. మాకు నచ్చిన విధంగా రోడ్డు పనులు చేస్తామని కాంట్రాక్టు ప్రతినిధులు అంటున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 38 రోడ్ల అభివృద్ధికి రూ.19.33 కోట్ల ఉపాధి నిధులు మంజూరయ్యాయి. ఈ పనుల్లో 50 శాతం మేరకు గ్రాండ్ అయ్యాయి.

ఉప్పరిపేట రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపం..

నరసన్నపేట మండలంలో ముషిడిగట్టు రోడ్డు నుంచి ఉప్పరిపేట, డోలపేట, అంబోజీపేట మీదుగా లుకలాం వరకు రెండు బిట్లుగా విడదీసి రూ.2 కోట్లతో తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కోమర్తి పంచాయతీ లకిమేర రోడ్డు పనులు కూడా ప్రారంభించారు. ఉప్పరిపేట రోడ్డు గతంలో గ్రావెల్ రోడ్డుగా ఉంది. ప్రస్తుతం చేపడుతున్న రోడ్డు పనుల్లో భాగంగా ఈ గ్రావెల్‌పై ఇసుక అధికంగా వేస్తున్నారు. రోడ్డు పనుల్లో నాణ్యతపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇసుకపై తారు రోడ్డు వేస్తే తమ కష్టాలు మొదటికి వచ్చేలా ఉన్నాయని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఇంజినీర్ల దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. ఇసుక వినియోగానికి బదులు మట్టి, గ్రావెల్ వేస్తామని ఇంజినీర్లు హామీ ఇచ్చారు. అయినప్పటికీ ఇసుకే వినియోగిస్తుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లఘించి రోడ్డు పనులు చేపడతే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇంజినీర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పనులు నాణ్యతగా చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు ఇలా నిర్మిస్తే ఎలా ?



రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఆనందిస్తున్నాం. అయితే పనులు నాణ్యతగా చేపట్టాలని కోరుతున్నాం. ప్రస్తుతం జరుగుతున్న పనులు మాలో ఆందోళన కలిగిస్తున్నాయి. తారు రోడ్డు నిర్మాణం చేస్తున్నప్పుడు కింద భాగంలో ఇసుకతో నింపేస్తున్నారు. ఆదే మా ఆందోళన. ఇలా అయితే రోడ్డు పనులు నాణ్యతగా జరుగుతాయా.. పనులు పూర్తయితే రోడ్డు ఎన్నాళ్లు ఉంటుందో అని అనుమానం కలుగుతుంది.

– గుర్రం వెంకటరమణ, ఉప్పరిపేట

రోడ్డు పనులు జరుగుతున్నాయి

నియోజకవర్గ వ్యాప్తంగా మార్చి నాటికి రోడ్డు పనులు పూర్తిచేయాలని భావిస్తున్నాం. రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే నిబంధనల మేరకు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. పర్యవేక్షణ పెంచుతాం. మరో 41 రహదారుల నిర్మాణానికి రూ.22 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. అనుమతి వస్తే పనులు ప్రారంభిస్తాం.

– సత్యంనాయుడు, పంచాయతీరాజ్ డీఈ, నరసన్నపేట

కాకర్లవాని చెరువు పరిశీలన

- ఆక్రమణలపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం
- శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష



గ్రామస్తులు, అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సాయి ప్రత్యూష

జలుమూరు: మండలంలోని చిన్నదూగాం పంచాయతీ కాకర్లవాని చెరువు ఆక్రమణలపై జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నామని శ్రీకాకుళం ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష అన్నారు. శనివారం చెరువుతో పాటు రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. చెరువు గర్భం, మదుములు ఎంతవరకు ఆక్రమణలకు గురయ్యాయన్నది పరిశీలించారు. చెరువు ఆక్రమణపై సుప్రీం కోర్టు న్యాయవాది డి.వి.రావు (గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ తరఫున) పోరాడుతున్నారు. అనంతరం పెద్ద దూగాంలో రేషన్ డిపోను ఆర్డీఓ పరిశీలించారు. నిత్యావసర సరుకుల పంపిణీ విధానం ఎలా ఉందో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ జెన్ని రామారావు, సర్వేయర్ నాగేశ్వరరావు, ఆర్ఐ కిరణ్ పాల్గొన్నారు.


రైతుకు ఇబ్బంది కలిగించొద్దు



మాట్లాడుతున్న ఏఓ నీరజ

కొత్తూరు: ధాన్యం విక్రయాలలో రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి పలువురు సభ్యులు తీసుకెళ్లారు. ఎంపీపీ సవర సావిత్రి ఆధ్వర్యంలో, ఎంపీడీఓ నీరజ అధ్యక్షతన శనివారం మండల సమావేశాన్ని నిర్వహించారు. ధాన్యంలో తేమ పేరుతో మిల్లర్లు పెట్టే ఇబ్బందులు తలెత్తకుండా ఈ ఏడాది కఠిన చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అభివృద్ధి పనుల వివరాలను ఏఓ రాంబాబు చదివి వినిపించారు. ధాన్యంలో తేమ, పొల్లు, ముక్కు ఎక్కువగా ఉందన్న నెపంతో 80 కిలోల బస్తాకు రెండు నుంచి ఐదు కిలోల వరకు మిల్లర్లు గతేడాది అధికంగా తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఏఓ స్వర్ణలత, తహసీల్దార్ రవిచంద్రకు వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు, పలువురు సర్పంచ్‌లు ఫిర్యాదు చేశారు. మండలంలోని ఏడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఏఓ చెప్పారు. మండలంలోని వైద్య సిబ్బంది పని తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కురిగాం పీహెచ్‌సీలో వైద్యులు సక్రమంగా హాజరుకావడం లేదన్నారు. ఆకులతంపరతోపాటు పలు గ్రామాల్లో రేషన్ డిపోలను బినామీలే నిర్వహిస్తున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. రేషన్‌కార్డుదారులందరికీ కందిపప్పు, గోధుమ పిండి, బోడి పిండి ఎందుకు ఇవ్వ డం లేదని వైస్ ఎంపీపీ ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి అలాట్‌మెంట్ తక్కువగా వస్తున్నందున డీడీలు తీసిన డీలర్లకే సరఫరా చేస్తున్నట్లు డీటీ తెలిపారు. మండల సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని, ఉపాధి పథకం నిధులతో వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని, మెటీరియల్ పనులు ఆయా పంచాయతీల్లో మాత్రమే చేయాలని తీర్మానించారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

రహదారిపైనే మురుగునీరు



సరుబుజ్జిలి మండల కేంద్రంలో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. మురుగు కాలువలు కప్పేసి నిర్మాణాలు చేయడం వలన మురుగునీరు రహదారులపై ప్రవహిస్తోంది. ఈగలు, దోమలు చేరి వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

- సరుబుజ్జిలి

చినుకు పడితే చెరువే..



ఎల్.ఎన్.పేట మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణం.. రోడ్డు కంటే లోతుగా ఉండటంతో వర్షం పడితే నీరు నిలిచిపోతుంది. పాఠశాలలోనికి వెళ్లేందుకు, పాఠశాల నుంచి రోడ్డుపైకి వచ్చేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షం పడినా నీరు నిలిచిపోతుంది. అధికారులు, పాలకులు స్పందించి పాఠశాల ఆవరణాన్ని ఎత్తు చేయాలని కోరుతున్నారు.

- ఎల్.ఎన్.పేట

పదహారేళ్లుగా..



హిరమండలం మండలంలోని రెల్లివలస గ్రామానికి 16 ఏళ్ల కిందట అంగన్‌వాడీ భవనం మంజూరైంది. నిర్మాణ పనులకు లక్షల రూపాయలు వెచ్చించారు. స్లాబ్ వేసి మిగతా పనులు పూర్తిచేయలేదు. కొద్దిపాటి పనులు చేపడితే ఈ భవనం వినియోగంలోకి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై కొత్తూరు ఐసీడీఎస్ సీడీపీఓ విమలకుమారి వద్ద ప్రస్తావించగా.. ఉన్నతధికారుల దృష్టికి తీసుకువెళ్లి వినియోగంలోకి వచ్చేలా అవసరమైన పనులు చేయిస్తామన్నారు.

- హిరమండలం

బెర్మ్‌లు వేసేదెప్పుడు?



ఎల్.ఎన్.పేట మండలంలోని చింతలబడవంజ కాలనీలో ప్రాథమికోన్నత పాఠశాలలో ఉన్న వీధికి సిమెంట్ రోడ్డు నిర్మించి బెర్మ్‌లు వేయటం వదిలేశారు. వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు పక్కకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఆధికారులు స్పందించి వెంటనే బెర్మ్‌లు వేసేందుకు చ్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- ఎల్.ఎన్.పేట

విధుల్లోకి తీసుకోవాలి



నిరసన తెలియజేస్తున్న సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు

ఆమదాలవలస: ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసిన సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లను విధుల్లోకి తీసుకొని, ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా వైన్‌షాప్ సూపర్ వైజర్, హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాపర వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆమదాలవలస నియోజకవర్గ యూనియన్ స్థాయి సమావేశం నిర్వహించి నిరసన తెలిపారు. బకాయిపడిన వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు.

గత ప్రభుత్వం రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ప్రభుత్వ మద్యం షాపుల్లో పలువురిని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాల్లోకి తీసుకుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మద్యం పాలసీ విధానాన్ని మార్చి తమ కుటుంబాలను వీధిన పడేసిందని ఆవేదన చెందారు. బకాయిపడిన జీతాలు, బోనస్‌లు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు కీర్తి ధర్మారావు, కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షులు సంతోష్ కుమార్, పాపారావు, సహాయ కార్యదర్శులు తేజేశ్వరరావు, కిరణ్, కోశాధికారి యాళ్ల చక్రి, సంఘ నాయకులు సంతోష్ కుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, మద్యం దుకాణాల సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

- శ్రీముఖలింగంలో పారిశుధ్య లోపం
- భక్తులు, పర్యాటకులకు అసౌకర్యం



శ్రీముఖలింగేశ్వరుని ఆలయం చెంతనే ఉన్న చెత్త



చెత్త కుప్ప వద్ద ఉన్న కుక్కలు

జలుమూరు: శ్రీముఖలింగం దర్శనానికి కార్తీక మాసంలో రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. రాష్ట్ర నలుమూలలతోపాటు విదేశీ యాత్రీకులు కూడా ఈ పర్యాటక కేంద్రాన్ని సందర్శిస్తారు. భక్తులు వంశధార నదిలో పుణ్య సాన్నాలు చేసి స్వామివారిని దర్శిస్తారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. నదిలోకి వెళ్లే రహదారి చెత్త, వ్యర్థాలతో నిండింది. దుర్వాసన రావడంతో ముక్కు మూసుకుంటున్నామని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో విశిష్టత కలిగిన దేవాలయం వద్ద ఇలా పారిశుధ్య లోపం ఉండడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ పుణ్య క్షేత్రంలో ఉన్న మధుకేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు వంశధార నదిలో సాన్నాలు చేయడం సంప్రదాయం. నది మెట్ల మార్గం మొత్తం చెత్తతో నిండిపోవడంతో కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తుస్తున్నాయి. భక్తులు వేరే మార్గం గుండా నదికి వెళ్తున్నారు. పంచాయతీ సిబ్బంది ఆదాయ మార్గాలపైనే శ్రద్ధచూపుతున్నారని, పారిశుధ్యాన్ని పట్టికోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి చిన్నాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని, పారిశుధ్య లోపం లేకుండా తగిన చర్యలు తీసుకుంటానన్నారు. యంత్రాలతో వ్యర్థాలు, చెత్త తొలగిస్తామని తెలిపారు.

బెల్ట్ షాపులపై కఠిన చర్యలు

పొందూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికారంగా మద్యం విక్రయాలు జరిపితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ వై.రాజు హెచ్చరించారు. అధిక ధరలకు విక్రయించినా, బెల్టు దుకాణాలు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతేడాది 134 బెల్టు కేసులు, 2024లో ఇప్పటివరకు 198 కేసులు నమోదయ్యాయన్నారు.

మరో అవకాశం ఇవ్వండి



పొందూరు హైస్కూల్ ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ రఘువర్మ

పొందూరు: మరోసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ఉపాధ్యాయులను కోరారు. మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను శనివారం సందర్శించారు. తాడివలస ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. కేజీబీవీ మోడల్ స్కూల్‌ను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తన పాత్రను వివరించారు. పొందూరు, తోలాపి, పిల్లలవలస, కింతలి, తదితర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వెళ్లి తనకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పప్పల తిరుమలరావు, సీనియర్ నాయకులు పేడాడ లక్ష్మణరావు, రాష్ట్ర కౌన్సిలర్ కోరుకొండ విజయ్‌కుమార్, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొగదాల రమణారావు, పొన్నాడ తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ అపార్ నంబర్



కార్మెల్ పాఠశాల సిబ్బందికి సూచనలిస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ అపార్ నంబర్ కేటాయించాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. మండలంలోని కల్లట కార్మెల్ పాఠశాలను, శ్రీరామేశ్వరి కళాశాలను శనివారం సందర్శించారు. విద్యార్థుల అకడమిక్ సమాచారాన్ని నిక్షిప్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అపార్‌ను తీసుకువచ్చిందన్నారు. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, ఫొటో, క్యూర్‌కోడ్, 12 అంకెలతో గుర్తింపు పొందిన నంబర్ ఉంటుందన్నారు. వివరాలు నమోదు చేసినప్పుడు ఎటువంటి పొరపాట్లు చేయవద్దన్నారు.

గంజాయి విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేష్

ఆమదాలవలస: గంజాయి విక్రయించినా, అక్రమ రవాణాకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని మెట్టక్కివలసలో యువకులు, ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. సైబర్ మోసాలు, గంజాయి రవాణా, ఖైనీ, గుట్కా అమ్మకాలు తదితర అంశాలపై చర్చించి, వాటి దుర్వినియోగం, తదుపరి చర్యలు వివరించారు. స్థానిక పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కుప్పిలికి సత్కారం



బహుమతి అందుకుంటున్న కవి కె.వి.రాజారావు మాస్టారు

ఆమదాలవలస: ప్రజాకవి కాళోజీ స్మారక జాతీయ స్థాయి కవితల పోటీల్లో బహుమతి పొందిన సందర్భంగా ఆమదాలవలసకు చెందిన కవి కె.వి.రాజారావు మాస్టార్‌ను హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శుక్రవారం సత్కరించారు. భారత్ కల్చరల్ అకాడమీ, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం నిర్వహించిన కవితల పోటీల్లో రాజారావు రచించిన 'నిర్లక్ష్యపు ముళ్లు మొలుస్తుంటే' కవితకు బహుమతి వరించింది. సంస్థ అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్, కార్యదర్శి సాధనాల వెంకటస్వామి నాయుడు చేతులు మీదుగా బహుమతిని అందుకున్నారు.

ఓటు నమోదుపై అవగాహన కల్పించాలి



ఓటు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ

ఎల్.ఎన్.పేట: ఓటు నమోదుపైన ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత బీఎల్‌ఓలదేనని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి, పెద్దకోట తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటు నమోదు కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ నెల 11, 23, 24 తేదీల్లోనూ ఓటు నమోదు, సవరణల దరఖాస్తుల స్వీకరణ కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఐ గవరయ్య, వీఆర్వోలు తిరుమలరావు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సారవకోట: ఓటు నమోదు కార్యక్రమాన్ని 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయలక్ష్మి సూచించారు. శనివారం మండలంలోని చీడిపూడి, బుడితి గ్రామాలలో జరుగుతున్న ఓటు నమోదు కార్యక్రమాలను పరిశీలించారు. శని, ఆదివారాలలో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

వేంకటేశ్వర స్వామికి పుష్పాలంకరణ



పుష్పాలంకరణలో స్వామివారు

సారవకోట: మండలంలోని చీడిపూడి వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారిని పుష్పాలతో అలంకరించారు. కార్తీక మాసం రెండో శనివారం కావడంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. అర్చకులు రామానుజాచార్యులు భక్తులతో ప్రత్యేక, విశేష పూజలు చేయించారు.

ప్రత్యేక పూజలు..



పూజలు అందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

పాతపట్నం: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డుకు సమీపంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అష్టోత్తర శత నామావలితో పూజలు జరిపించారు. పాతపట్నం, కొరసవాడ, ఒడిశాకు చెందిన భక్తులు వందలాది మంది తరలివచ్చారు.

అధిక ధరలకు విక్రయిస్తే కేసులు

ఆమదాలవలస: ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎక్సైజ్ సీఐ జి.సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గత సంవత్సరం నుంచి ఇప్పటివరకు 164 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసులకు సంబంధించిన 165 మంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. వారినుంచి 2,115 మద్యం సీసాలను స్వాధీనపర్చుకున్నామన్నారు. వారందరినీ ఆయా మండల తహసీల్దార్ల ఎదుట హాజరుపర్చి బైండోవర్ నమోదు చేశామన్నారు. నాలుగు నాటు సారా కేసుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారినుంచి 13 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

లైసెన్సులు రద్దు చేస్తాం..

నూతన మద్యం విధానం ప్రకారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట మండలాల్లో 13 మద్యం షాపులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బెల్టు దుకాణాల ద్వారా మద్యం అమ్మకాలు చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. గ్రామాల్లో మద్యం పాటలు నిర్వహిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తే ఫోన్ 9440902335, 9492454580, 8330990779 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ఇసుక డంపింగ్ యార్డ్ పరిశీలన



డంపింగ్ యార్డు వద్ద సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంట ఇసుక డంపింగ్ యార్డును శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష శనివారం పరిశీలించారు. డంపింగ్ జరుగుతున్న తీరును, ఇసుక లోడింగ్ విధానం ఎలా చేస్తున్నారనే దానిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. లోడింగ్ చేస్తున్న ప్రతి లారీ వివరాలు నమోదు చేయాలన్నారు. కట్టుదిట్టంగా ఇసుకను డెలివరీ చేయాలని సూచించారు. రోజుకు ఎన్ని లారీలు వస్తున్నాయనేది అడిగి తెలుసుకున్నారు. నరసన్నపేట తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

రీడింగ్ రూమ్ ప్రారంభం



రీడింగ్ రూమ్‌ను ప్రారంభిస్తున్న రిటైర్డ్ జేసీ రజనీకాంత్

పాతపట్నం: మండలంలోని కొరసవాడ ప్రధాన రహదారి అనుకుని ఉన్న ఆంధ్ర బాపిస్ట్ చర్చిలో ఏర్పాటు చేసిన రీడింగ్ రూమ్‌ను రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ పి.రజనీకాంత్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత, రైతులకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సాహిత్యం, చరిత్ర, కళలు, జీవిత చరిత్రలు, వ్యవసాయం వివిధ రకాల పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చర్చిలో కృతజ్ఞత పండగ నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన పాస్టర్ స్టీవెన్ పీటర్, పాస్టర్ ఫిలిప్, బుగత అనిల్‌కుమార్, లారెన్స్, సతీష్ బెహరా, హేమలత, అప్పారావు, ఇందిరామణి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు డీఎంహెచ్ఓ శ్రీకాంత్

నరసన్నపేట: వాతావరణ మార్పులతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ తాడేల శ్రీకాంత్ అన్నారు. మండలంలోని పోతయ్యవలసలో మాకివలస పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని శనివారం పరిశీలించారు. శీతాకాలంలో చలిగాలుల తీవ్రత పెరగవచ్చని, చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పీహెచ్‌సీల్లో ఉన్న మందులను అవసరం మేరకు రోగులకు పంపిణీ చేయాలన్నారు. ఆరోగ్య తనిఖీలు సక్రమంగా నిర్వహించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. పారా మెడికల్ ఆఫీసర్ సురేష్ కుమార్ ఉన్నారు.

ధ్యాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి



గంగరాపు సింహాచలం

హిరమండలం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారం రోజులుగా ధాన్యం మార్కెట్లోకి వస్తున్నాయన్నారు. దళారులు లాభపడుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రైతుల పేరుతో ప్రభుత్వమే ఉచిత పంటల బీమా చెల్లించాలన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: ఫోన్ అధికంగా వినియోగిస్తే సైబర్ నేరస్తులకు అవకాశం కల్పించినట్లు అవుతుందని స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వైకుంఠరావు అన్నారు. కొసమాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైబర్ మోసాలపై శనివారం అవగాహన కల్పించారు. రోజురోజుకూ ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. ఏటీఎం పిన్, అకౌంట్ వివరాలను ఎవరికీ చెప్పవద్దని, సోషల్ మీడియాలో సైతం బహిర్గతం చేయవద్దని సూచించారు. మొబైల్ యాప్‌లలో వచ్చిన అనవసరమైన లింకులను క్లిక్ చేయవద్దన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.